
www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 17 | జూన్ | 2025
పేజీలు : 7

## దళిత మహిళలపై దాడి




2 లో

# నకిలీ విత్తనాల బెడద..!




- పత్తి విత్తనాలతో మోసపోతున్న రైతన్నలు
- దాడులు అంతంతమాత్రమే..
- టాస్క్‌ఫోర్స్ దృష్టి సారిస్తే మేలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆకాశం నుండి నీటి చుక్కలు నేలరాలుతుండగా పంటల సాగుకు రైతులు ఉపక్రమిస్తున్నారు. ఇప్పటికే నేలను సారవంతం చేసుకున్న రైతన్నలు పంటలకు అనుగుణంగా వ్యవసాయ క్షేత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి కనీస మద్దుతు ధర పెంచడంతో ఈ సారి జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేసేందుకు రైతులు ఆశక్తి చూపుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పుడు ప్రధాన సమస్య విత్తనాలే. ఏజెన్సీ ప్రాంతాలను టార్గెట్ చేసుకుని మాయ కంపెనీలు రైతులను మోసం చేసేందుకు రంగం సిద్ధం చేసుకుని గ్రామాల్లో సంచరిస్తున్నట్లుగా తెలుస్తోంది. చాలా మంది రైతులు నికిలీ విత్తనాలతో పెద్ద ఎత్తున మోసపోయి లబోదిబోమన్న సందర్భాలు ఏజెన్సీలో అనేకం. అక్రమ సంపాదనే ధ్యేయంగా ఉన్న కొందరు రైతులను నట్టేట ముంచుతూ వారి జీవితాలను చేలల్లో నాశనం చేస్తున్నారు.

### మార్కెట్‌లోని నకిలీలు...

మార్కెట్లో పత్తి, మిర్చి విత్తనాలు పెద్ద ఎత్తున ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఎప్పటిలాగానే ఈ సారి కూడా భద్రాద్రి ఏజెన్సీని కేటుగాళ్లు అడ్డగా చేసుకుని రాత్రివేళల్లో విక్రయాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. పత్తికి కనీస మద్దతు ధర పెరగడంతో పత్తి విత్తనాలకు డిమాండ్ పెరిగింది. దీంతో రైతాంగాన్ని మాయమాటల్లో చెప్పి మొగ్గులోనికి దింపి నకిలీ విత్తనాలు అంటగట్టేందుకు ఓ ముఠా ఇప్పటికే భద్రాచలం కేంద్రంగా పాగా వేసినట్లు సమాచారం.

మిగతా 2లో..

## పేదల సొంతింటి ఆకాంక్ష నెరవేర్చేందుకు చర్యలు

-పెండింగ్ లబ్దిదారుల ఎంపిక ఏడు రోజుల్లో పూర్తి
-డబుల్ బెడ్‌రూం ఇండ్లను పారదర్శకంగా కేటాయించాలి
-ఇందిరమ్మ, డబుల్‌బెడ్‌రూం ఇండ్లపై కలెక్టర్ సమీక్ష




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పేదల సొంతింటి ఆకాంక్ష నెరవేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూం ఇండ్లపై అసెంబ్లీ నియోజక వర్గ ప్రత్యేకాధికారితో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు పూర్తి స్థాయి మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ప్రతి మండలం, గ్రామానికి మొదటి విడతలో కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల సంఖ్య ప్రకారం లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ కమిటీలను

మిగతా 2లో..

## విడతలవారీగా ఇందిరమ్మ ఇండ్లు



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించే బాధ్యత నాదే అని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని గువ్వలగూడెం, కోరట్లగూడెం, మోటాపురం లో సోమవారం పర్యటించి. వివిధ అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మన ప్రభుత్వం పేదోడీ కి అండగా నిలుస్తుందని అన్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఉచిత విద్యుత్, గ్యాస్ ను అందిస్తున్నట్లు తెలిపారు. పేదలకు జబ్బు చేస్తే రూ.10 లక్షల వరకు ఆరోగ్య శ్రీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో రూ.17 వేల కోట్లు మాఫీ చేస్తే... ఇందిరమ్మ ప్రభుత్వం పది నెలలోనే రూ.21 వేల కోటు మాపీ చేసినటు తెలిపారు. సన్న వడ్ల కు రూ.500 బోనస్ ను అందిస్తున్నట్లు పేర్కోన్నారు. పేదలకు సన్నరకం బియ్యం ను అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నాలుగున్నర లక్షల ఇళ్లకు రూ.22 వేల 500 కోట్లు తో ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇల్లు ఇచ్చినట్లు తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేస్తామని అన్నారు.

### జిల్లాను మరింత అభివృద్ధి చేస్తాం...

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఖమ్మం జిల్లా లో కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటి కార్యక్రమంకు హజరు

మిగతా 2లో..

## ప్రత్యక్ష సంక్షేమం.. ప్రజలపై పరోక్ష భారం




-ఉత్పాదక శక్తిని పెంచలేని మోడీ అభివృద్ధి
-ప్రజల కోసం పనిచేసేది సిపిఐ మాత్రమే
-చింతకాని మండల మహాసభలో బాగం

**ప్రజాపక్షం/ చింతకాని :** పాలక వర్గాలు ప్రత్యక్షంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలపై పరోక్ష భారాన్ని మోపుతున్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. ఈ భారం ప్రజలను మరింత పేదలను చేస్తుందని ఆయన తెలిపారు. సోమవారం చింతకాని సిపిఐ 17వ మండల మహాసభ మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో జరిగింది. కూచిపూడి రవి, మార్గం శ్రీనివాస్, గుండ్ల బేబీరాణి అధ్యక్ష వర్గంగా వ్యహరించిన సభలో హేమంతరావు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులను ముప్పుతిప్పలు పెడుతున్నాయని ఒక పక్క ధరలు పెంచుతూ పన్నుల భారం మోపుతూ మరో పక్క అరకొర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మోడీ అభివృద్ధి, ఐక్యత అంటూ గొంతు చించుకుంటున్నారని మోడీ 11 ఏళ్ల పాలనలో ఏ రంగంలో ఉత్పాదక పెరిగిందో, ఏ రంగం స్వయం సమృద్ధిని సాధించిందో తెలపాలని హేమంతరావు డిమాండ్ చేశారు. సంపన్న వర్గాలు మిలీయనీర్లుగా, బిలీయనీర్లుగా, మల్టీ బిలీయనీర్లుగా రూపాంతరం చెందారు తప్ప పేదల జీవన విధానంలో కనీస సానుకూల మార్పులు జరగలేదని ఆయన తెలిపారు. నిజానికి ముందు అబద్దం ఆరు ఇండ్లు చుట్టివచ్చిందన్నట్లుగా పెరిగిన శాస్త్ర సాంకేతిక రంగాన్ని మోడీ తన అబద్దపు ప్రచారాలకు వాడుకుంటున్నాడని ఆయన తెలిపారు. రైతు బీమా అమలులో వైఫల్యం చెందిన కేంద్ర సర్కార్ గ్రామీణ పేదలకు బతుకుదెరుగా మారిన జాతీయ ఉపాధి హామీ పథకం కేటాయింపులు తగ్గించిందని వీలైతే ఎత్తివేసేందుకు సిద్దమవుతుందని ఆయన తెలిపారు. బిజెపి లేదా దాని అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న వారు షోకాల్డ్ దేశభక్తులేనని నిన్న మొన్నటి వరకు జాతీయ జెండాను గౌరవించని

మిగతా 2లో..

# ప్రత్యక్ష సంక్షేమం.. ప్రజలపై పరోక్ష భారం

(మొదటిపేజీ తరువాయి)



వారు ఏ పాటి దేశ భక్తులో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో వైఫల్యం చెందిందన్న భావన సర్వత్రా వినపడుతుందని దీని నుంచి బయటపడేందుకు ప్రభుత్వం హామీల సత్వర అమలుకు పూనుకోవాలని హేమంతరావు సూచించారు. ఒక పక్క మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి మరో పక్క బస్ ఛార్జీలు పెంచడం దేనిని సూచిస్తుందనిఆయన ప్రశ్నించారు. పంటల బీమాపై ఆశ పోయిందని ఇప్పుడు రైతు భరోసా పై కూడా అపనమ్మకం ఏర్పడిందన్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే ఈ దేశంలో భూ సంస్కరణల చట్టం, జాతీయ ఉపాధి హామీ పథకం, అటవీ హక్కుల చట్టం, ఒకప్పటి బ్యాంకుల జాతీయకరణ, సమ్మె హక్కు, సమాన పనికి సమాన వేతనం మొదలైన చట్టాలను సాధించుకున్నామన్నారు. కమ్యూనిస్టులపోరాటం లేకుండా భారతదేశంలో ఏ పథకం రూపుదిద్దుకోలేదంటే అతిశయోక్తి కాదన్నారు. ఒక పక్క నిర్మాణాన్నిపెంపొందించుకుంటూ మరో పక్క ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తులు ఉన్నా లేకున్నా మన సత్తా చాటేందుకు సిద్ధం కావాలన్నారు. సభకు ముందు పార్టీ పతాకాన్ని బాగం హేమంతరావు ఆవిష్కరించారు. గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. మహాసభలో రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహాలక్ష్మి , ఏపూరి రవీంద్రబాబు, మేకల శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పగిడిపల్లి ఏసు, దూసరి శ్రీరాములు, కన్నెబోయిన విజయమ్మ, రాసాల మోహన్‌రావు, పావులూరి మల్లికార్జున్, వెంగళ ఆనందరావు, దూసరి గోపాలరావు, అబ్బూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



### నూతన కార్యదర్శిగా దూసరి గోపాలరావు



చింతకాని మండల నూతన కార్యదర్శిగా దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులుగా అబ్బూరి మహేష్, మార్గం శ్రీనుతో పాటు 48 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# నకిలీ విత్తనాల బెడద..!

(మొదటిపేజీ తరువాయి)

మంచిదిగుబడి వస్తుందంటూ మాయ మాటలు చెప్పి అట్టగట్టిన తర్వాత కాపు, పూత లేకపోవడంతో రైతులు లబోదిబో మంటున్న సందర్భాలు అనేకం. ఆఖరికి వత్తనాలు అంటగట్టిన వారు ముఖం చాటేస్తున్నారు. గట్టిగా అడిగేందుకు రైతుల వద్ద కనీసం బిల్లులు కూడా లేకపోవడంతో పరిస్థితి తారుమారవుతోంది.

### రైతున్నలు అప్రమత్తంగా ఉండాలి...

నకిలి విషయంలో రైతన్నలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్లపై ఉన్న బ్యాచ్‌నెంబర్లతో పాటు బిల్లులు తీసుకోవాలి. వ్యవసాయాధికారులు సైతం రైతులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది. ఎప్పటికప్పుడు రికార్డులు పరిశీలిస్తూ అమ్మకాలపై నిఘా పెడితే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది. రైతు సంఘాల నాయకులతో సైతం గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల్లో చైతన్యాన్ని నింపితే తప్ప ఏజెన్సీ రైతాంగానికి మేలుజరిగే అవకాశాలు లేవు. జిల్లా వ్యాప్తంగా టాస్క్ ఫోర్సు బృంధాలు పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాలపై ఉక్కు పాదం మోపాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# విడతలవారీగా ఇందిరమ్మ ఇండ్లు

(మొదటిపేజీ తరువాయి)

కావటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా ను అభివృద్ధి లో మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, రావెళ్ల కృష్ణారావు, కొమ్మినేని విజయ్బాబు, జెర్రపోతుల సత్యనారాయణ,కుక్కల హనుమంతరావు, మార్తి కోటి, మధు, వెంకటేశ్వర్లు, వాసు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి ఆకాంక్ష నెరవేర్చేందుకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఫాలోఅప్ అవుతూ బఫర్ సంఖ్యతో కలిపి లబ్దిదారుల జాబితాను తెప్పించుకోవాలన్నారు. ఇందిరమ్మ కమిటీలు పెట్టిన జాబితాను మరో సారి ధృవీకరణ చేసి ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక, ప్రొసిడింగ్స్ పంపిణీ ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఖమ్మం జిల్లాలో లబ్దిదారులకు పంపిణీ చేయకుండా పూర్తి చేసిన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల రిపోర్టు అందించాలన్నారు. ఎంపిక చేసిన లబ్దిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లను కంప్యూటర్ సిస్టం ర్యాండమైజేషన్ ద్వారా కేటాయింపు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో నిర్మాణ పురోగతిలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వీటిని సొంత భూమి లేని నిరుపేదలకు కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల క్రింద నిధులు మంజూరు చేసి పూర్తి చేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ పైలెట్ గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్దిదారులకు పంపిణీ చేసిన ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటి వరకు 500కు పైగా గ్రౌండ్ చేయడం జరిగిందన్నారు. ప్రతి నియోజక వర్గంలో 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఈవో దీక్షారైనా, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఆర్డీవోలు జి. నర్సింహారావు, ఎల్. రాజేందర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత మహిళలపై దాడి

**ప్రజాపక్షం/కామేపల్లి:** దళిత మహిళలపై దాడి చేసి గాయపరిచిన సంఘటన మండల పరిధిలోని పింజరమడుగు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... పింజమడుగు గ్రామానికి చెందిన చిప్పలపల్లి ఆనంద్‌ను గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు దాడి చేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న ఆనంద్ కుమార్తెలు తన తండ్రిని పరామర్శించేందుకు గ్రామానికి వచ్చారు. అనంతరం గ్రామంలో తన తండ్రిని ఎందుకు కొట్టారని ఆనంద్ కుమార్తెలు ప్రశ్నించినందుకు గాను పింజరమడుగు గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు, తో పాటు కొంత మందితో కలిసి దళిత మహిళలపై విచక్షణ రహితంగా కులం పేరుతో దూషిస్తూ క్రరతలో దాడి చేశారని బాధిత మహిళలు విలేకరులకు తెలిపారు. కొట్టిన దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రచారం అవుతు న్నాయి. ఈ సంఘటన పై కామేపల్లి ఎస్ఐ సాయికుమార్, ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి విచారణ అనంతరం దోషులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గాయ పడ్డ మహిళలను వైద్య సేవలు నిమిత్తం పోలీసుల సహాయంతో ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు పంపారు.

# సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎస్సై రామారావు

**-ఆరుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్ళు ఏర్పాటు**
**-ఉద్యోగం చేసిన ప్రతిచోట మానవత్వాన్ని చాటుకుంటున్న మహోన్నత వ్యక్తి**





**ప్రజాపక్షం/వైరా:** వైరా ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పుప్పాల రామారావు మనసు ఎంతో గొప్పది. గొప్ప మనసే కాదు ఆపదొస్తే ఆదుకోవాలని తపనపడే గొప్ప హృదయం అతనిది. పోలీస్ ఉద్యోగంలో చేరినప్పటి నుండి ఎక్కడ విధులు నిర్వహించిన అక్కడ ఎంతోమంది అభాగ్యులకు అండగా నిలబడి నేనున్నాను మీకంటూ భరోసా ఇచ్చి వారిలో ఒక ధైర్యాన్ని నింపుతున్న వ్యక్తి ఎస్సై రామారావు. ప్రమాదాలు, అనారోగ్య పరిస్థితుల్లో ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల్లో కాళ్ళు కోల్పోయి దివ్యాంగులుగా పలువురికి వైరా ఎస్సై పుప్పాల అధునాతన కృత్రిమ కాళ్ళను గుంటూరు మంగళగిరిలో అందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరిలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్‌ల సౌజన్యంతో ఉచిత క్యాంపు ఏర్పాటు చేయగా క్యాంపు నిర్వాహకులతో మాట్లాడి ఈ క్యాంపులో ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం నుండి తాళ్లూరి జనార్ధన్, కారేపల్లి మండలం నుండి



గుగులోతు సాలి, ఖమ్మం రూరల్ మండలం చింతపల్లికి చెందిన కుక్కబాపు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం మారుమూల ఆదివాసిగూడెం గుండాల పాడుకు చెందిన కారం గంగరాజు, పాల్వంచ టౌన్‌కు చెందిన మడుగుల చంద్రకళ, బూర్గంపహాడ్ మండలం పినపాకకు చెందిన మేకల కృష్ణార్జునరావులు మధుమేహం, రోడ్డు ప్రమాదం, విద్యుత్ షాక్‌ల వలన తమ కాళ్ళను కోల్పోయి తమ దైనందిన కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదుర్కొంట చేతి కర్ర సహాయంతో కష్టంగా ఇంటి వద్దనే ఉంటున్నారు. వారి వివరాలు తెలుసుకున్న పోలీస్ అధికారి పుప్పాల రామారావు రోటరీ క్లబ్ మంగళగిరి సంప్రదించి వారి సహకారంతో ఆరుగురికి కొలతలు చేపించి వీరికి అధునాతనమైన ప్రోస్తేటిక్, కృత్రిమ కాళ్ళను ఏర్పాటు చేపించి మంగళగిరిలో అందించారు. తక్కువ బరువు, ఎక్కువ నాణ్యత ఉన్న ఈ కృత్రిమ ప్రొస్తేటిక్ కాలుతో సాధారణ నడకతో పాటు ద్విచక్ర వాహనాలు కూడా నడపవచ్చు. ఈ ఆరుగురు దివ్యాంగులు తమ కుటుంబాలతో వచ్చి స్థానిక వైరా స్టేషన్ నందు ఎస్సై పుప్పాల రామారావును కలిసి ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ, రోటరీ క్లబ్ మంగళగిరి, జూబ్లీహిల్స్‌కు వైరా ఎస్సై పుప్పాల రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# సన్‌రైజ్ ఆధ్వర్యంలో పెళ్లి కానుక



**ప్రజాపక్షం/ఖమ్మం :** సన్‌రైజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పాలడుగు గ్రామంలో పెళ్లి కానుక అందజేశారు. నాగమణి, శ్రీను దంపతుల కుమార్తె శిరీష వివాహ సందర్భంగా సంస్థ ఉపాధ్యక్షులు ఏనుగు శివరాఘవ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు మాలతిదాసు లు పెళ్లి కానుకను అందజేశారు. నూతన వధూవరులు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని ఖానాపురం, కొండకొడిమ, వైరా రైతువేదికల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కొండకొడిమ, వైరా రైతువేదికల్లో మన వైరా మండలానికి కొత్తగా వీడియో కాన్ఫరెన్స్‌లు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైరా తహశీల్దార్ శ్రీనివాస్, వైరా ఎంపిడివో సరస్వతి, వైరా వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, వ్యవసాయ విస్తరణ అధికారులు సనవత్ సైదులు, పరిటాల వెంకటనర్సయ్య, మేడా రాజేష్, ఆలూరి వాసంతి, వెంపటి కీర్తి, పంచాయతీ సెక్రటరీ వెంకటరమణ, రవీందర్, రైతులు షేక్ లాల్‌మహ్మద్, షేక్ మౌలాలి, వీరపనేని కిషోర్, నర్వనేని అశోక్, కొల్లి శ్రీనివాసరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతు నేస్తం సందర్భంగా తల్లాడ మండలం రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న తల్లాడ ఎంపిడివో ఏనుగు సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, నూతనకల్, తల్లాడ, మిట్టపల్లి క్లస్టర్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

**-వన్‌టౌన్‌లో సమస్యలను వెంటనే పరిష్కారించాలి**
**- నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని వన్‌టౌన్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం నగరంలోని 19వ డివిజన్‌లో వన్‌టౌన్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జానిమియా మాట్లాడుతూ వన్‌టౌన్ ప్రాంతంలో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా డ్రైనేజీ, రోడ్ల సమస్య అధికంగా ఉందన్నారు. 19వ డివిజన్‌లో నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించడం లేదని ఆయన విమర్శించారు. నిర్మాణ పనులను అధికారులు పర్యవేక్షించకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని ఆయన తెలిపారు. గతంలో ఉన్న రోడ్లపైనే మరల రోడ్లు వేస్తున్నారని ఇప్పుడు ఆ రోడ్లు తగ్గించి పోయవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా ఎంపి నగర్‌లో పాడైపోయిన రోడ్ల స్థానంలో వాటిని తొలగించకుండానే వాటిపైనే రోడ్లు వేస్తున్నారని అయిన అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. సాయి నగర్ ప్రాంతంలో గతంలో రోడ్లు మంజూరైన నిర్మాణం చేపట్టలేదని వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేవారు. సాయి నగర్, శ్రీరాం నగర్ తదితర ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు లేక వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే వసతులు కల్పించాలని కోరారు. రేషన్‌కార్డులు లేక ఎంతో మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. సమస్యలను వెంటనే పరిష్కారించాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్, వన్‌టౌన్ ఏరియా కార్యదర్శి వరదా నర్సింహారావు, మాలకొండయ్య, సామేలు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**-సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలి**
**-ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే దరఖాస్తు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నిబంధనల ప్రకారం మనం ఏదైనా దరఖాస్తు పరిష్కారం చేయలేని సమయంలో కారణాలు తెలియజేస్తూ స్పష్టమైన సమాధానం ఇవ్వాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులను జిల్లా అధికారులు పక్కాగా ట్రాక్ చేయాలని, మండల పరిధి నుంచి వచ్చే సమాధాలు ఎలా ఉంటున్నాయో క్రాస్ చెక్ చేసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం కావాలన్నారు. ట్విట్టర్, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తూ ట్రాక్ చేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. రాలేని పక్షంలో ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఖమ్మంజిల్లాలో చాలా మంచి స్టాఫ్ ఉందని భవిష్యత్తులో మంచి పనితీరు కొనసాగించాలన్నారు. వేంసూరు మండలం బీరపల్లి గ్రామానికి చెందిన ప్రజలు తమ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం జరుగుతుందని వాటిని వెంటనే నిలిపి వేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం శ్రీరాం హీల్స్ ప్రాంతానికి చెందిన వనమా ఉషారాణి ధంసలాపురం సర్వే నెం. 194లో రెండు ఎకరాల వ్యవసాయ భూమిని 2008లో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని ఆ భూమిని ఇతరులు ఆక్రమించారని భూ భారతి చట్టం ప్రకారం పట్టా పాసుపుస్తకం రద్దు చేసి తమ పేరున పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరం బొక్కలగడ్డ ప్రాంతానికి చెందిన చట్ల సునీత 15 సంవత్సరాలుగా తాను కిరాయి ఇంట్లో ఉంటున్నానని తనకు డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన పొద్దుటూరు నాగేశ్వరరావు తమ పంట పొలాలకు రామన్న చెరువు అలుగు నీటిని మళ్లింపు చేసి నష్టం చేస్తున్నారని తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పి సిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/ మధిర :** ఈ నెల 21, 22తేదీల్లో ఖమ్మం నందు ఐఎంఎ హాల్‌లో టిఎస్ ఆర్టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేష్(సిఐటియు) రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు, ఈ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, బి. సుధాకర్ కోరారు. మహాసభల జయప్రదంలో భాగంగా ప్రచార జీపు జాతా సోమవారం మధిర డిపోకు చేరింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టిసి ఉద్యోగులందరూ అధికసంఖ్యలో ఈ మహాసభలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కార్యదర్శి పి.సుధాకర్, సహాయ కార్యదర్శి జె.నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శి టి.బాబు, డిపో కార్యదర్శి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగిఉండాలి : ఎసిపి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ రిక్కాబజార్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్న వయస్సులోనే విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలను తెలియజేయడం వలన వారిలో క్రమశిక్షణతో పాటు బాధ్యతయుతంగా వ్యవహరిస్తారని ఫలితంగా రోడ్డు ప్రమాదాలు తగ్గించవచ్చన్నారు. మైనర్లు, సెల్‌ఫోన్, ర్యాష్ డ్రైవింగ్ వలన కలిగే అనర్థాలు, హెల్మెట్, సిటు బెల్ట్ వాడకం ప్రాముఖ్యతను వారికి వివరించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరు, వాహనదారులు పాటించవలసిన రూల్స్‌ను ప్రయోగాత్మకంగా తెలియజేశారు. ఈ సదస్సులో సిఐ సత్యనారాయణ, ఆర్ఐ సాంబశివరావు, ఎస్సై రవి, రాము తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ మండల కార్యదర్శిగా శాఖమూరి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సిపిఐ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రఘునాథపాలెం మండల కార్యదర్శిగా శాఖమూరి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన శాఖమూరి శ్రీనివాసరావు మూడోసారి మండల కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. వి.వెంకటాయపాలెం గ్రామంలో జరిగిన సిపిఐ మండల మూడో మహాసభలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా శాఖమూరి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా జూల వెంకటేశ్వర్లు, లచ్చిరాం లతో పాటు 21 మందితో కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తనపై నమ్మకంతో మూడోసారి మండల కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మధిరలో మిర్చి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** మధిరలోని మార్కెట్ యార్డ్ నందు సోమవారం మిర్చి కొనుగోలు కేంద్రాన్ని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, టిడిపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరిసర ప్రాంత రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని, రైతులు నేరుగా తమ మిర్చి పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆత్మ కమిటీ చైర్మన్, వ్యవసాయశాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య




**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని హెల్పింగ్ హ్యాండ్స్ బాధ్యులు మధులిక అన్నారు. మధిర మండలంలోని నక్కలగరుబు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ సౌజన్యంతో విద్యార్థులు నోట్ పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, ప్రతిఒక్కరూ ప్రభుత్వ బడుల్లో చేరాలని, ప్రభుత్వ పథకాలు వినియోగించుకున్న మాదిరిగానే తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేర్చి వారి భవితకు పాటుపడాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ బాధ్యులు, హెచ్‌ఎం వి.నాగార్జున్‌రావు, గ్రామ పెద్దలు సంపసాల రామకృష్ణ ఎరదేశి మల్లికార్జున్, శ్రీరాములు పాఠశాల ఉపాధ్యాయులు వి. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ మిత్ర కార్మికులకు ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛ మిత్ర కార్మికులకు ప్రభుత్వమే వేతనాలు అందించాలని ఆ సంఘం నాయకురాలు చిన్నమ్మ డిమాండ్ చేశారు. సోమవారం తల్లాడ మండల విద్యాశాఖ అధికారి దామోదర్ ప్రసాద్‌కు ఎఐటీయూసి ఆధ్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందచేశారు. స్వచ్ఛ భారత్ పేరుతో 2015 నుండి 2019 వరకు విధులు నిర్వహించిన స్వచ్ఛ మిత్ర కార్మికులు ఆతర్వాత విధులు లేక ఆగిపోయారని, 2023 నుంచి స్వచ్ఛ మిత్రులుగా గుర్తించిన ప్రభుత్వం మళ్లీ విధుల్లోకి తీసుకోవటం జరిగిందని తెలిపారు. గతంలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా వేతనం చెల్లిస్తున్నారని, ఆదర్శ కమిటీలతో సంబంధం లేకుండా ప్రభుత్వమే నేరుగా స్వచ్ఛ మిత్ర అకౌంట్‌లో వేతనం జమ చేయాలని కోరారు. అదేవిధంగా ఫెన్షన సౌకర్యం కల్పించాలని, పెండింగ్ వేతనాలను చెల్లించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ మిత్ర సంఘం నాయకులు మౌనిక, రాధా, మరియమ్మ, నసీరా, ఝూన్సీ, గోపాలరావు, శివకృష్ణ, రమేష్, కె.వెంకటమ్మ, స్వరూప, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతగల కమ్యూనిస్టు పెరిక ప్రభాకర్



**ప్రజాపక్షం/చింతకాని :** సీపీఐ సీనియర్ నాయకులు నేరడ గ్రామానికి చెందిన పెరిక ప్రభాకర్ నిబ్బద్దత గల కమ్యునిస్టు అని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు.సోమవారం ఉదయం అనారోగ్యంతో పెరిక ప్రభాకర్ మృతిచెందడంతో విషయం తెలుసుకున్న భాగం నేరడ గ్రామానికి చేరుకుని ప్రభాకర్ మృతదవేహం పై

## సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం

పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా భాగం హేమంతరావు మాట్లాడుతూ కృష్ణయ్య బ్రతికినంతకాలం ఎర్రజెండా ని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు.ఈ ప్రాంతంలో కమునిస్టు ఉద్యమం బలపడటానికి ఫ్రభాకర్ పాత్ర ఎనలేనిదన్నారు. ఫ్రభాకర్ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జుమ్ముల జితేందర్ రెడ్డి,కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, సింగు నర్సింహారావు, మేకల నర్సింహారావు, సీఆమహాలక్ష్మి , ఏనుగు వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జునరావు , సహాయ కార్యదర్శులు దూసరి గోపాలరావు, అబ్బూరి మహేష్,జిల్లా సమితి సభ్యులు దూసరి శ్రీరాములు, నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు దూసరి నేతాజీ పాల్గొన్నారు.

# రైతు నేస్తంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతు నేస్తం కార్యక్రమంలో అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర వ్యాప్తంగా 1631 రైతు వేదికల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కోసం విసి యూనిట్లను ప్రారంభించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం మండలంలోని రఘునాథపాలెం, రాంక్యాతండా, వివిపాలెం గ్రామాల్లోని రైతు వేదికల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు శిక్షణ కేంద్రం జాయింట్ డైరెక్టర్ అభిమాన్యుడు, ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, రావూరి సైదబాబు, తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవో ప్రతిభ, వేదవ్యాస్, శివ కృష్ణ, శిరణ్మయి, వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. అల్లిపురం రైతు వేదిక నందు నిర్వహించిన విసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ రావూరి కరుణ సైదబాబు, ఏవో కిషోర్, ఏఈవో, సంక్రాంతి నాగేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# డయేరియా వ్యాధిపై అవగాహన

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** డయేరియా (అతిసారం) వ్యాధిపై అవగాహన కల్పించారు. సోమవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం హెల్త్ సబ్ సెంటర్‌లో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంటర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతి బాయి పాల్గొని మాట్లాడారు. డయేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. డయేరియా వచ్చిన వారికి కడుపునొప్పి తరచూ మల విసర్జన, నీళ్ల విరోచనాలు, వికారం, వాంతులు వంటివి లక్షణాలు ఉంటాయని తెలిపారు. డయేరియా సోకకుండా ఉండేందుకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తరచూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సురక్షితమైన త్రాగునీటిని సేవించాలని, తాజాగా వండిన ఆహారాన్ని స్వీకరించాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని సేవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చందునాయక్, మంచుకొండ వైద్యాధికారి బాలకృష్ణ, వివిపాలెం సబ్ సెంటర్ ఎఎన్ఎం పుష్పావతి, మౌనిక, కృష్ణయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా డయేరియా నివారణకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు.



# టియుసిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ తల్లాడ :** ఈనెల 21, 22 తేదీల్లో నిజామబాద్ జిల్లా కేంద్రంలో జరుగనున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టియుసిఐ) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం తల్లాడలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభల్లో ముఖ్యంగా దేశంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి రాబోయే కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు పోరాటాలు నిర్వహించేందుకు భవిష్యత్ కార్యచరణ రూపొందించటం జరుగుతుందని తెలిపారు. ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్. లాల్మీయా మాట్లాడుతూ దేశంలో సంఘటిత, అసంఘటిత రంగం కార్మికుల హక్కులను హరించకపోతున్న తరుణంలో ఈ మహాసభలు జరుగుతున్నారని, కార్మిక హక్కులను కాపాడుకునేందుకు కార్మికులంతా సంఘటితమై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ బహిరంగ సభలో టియుసిఐ ఆలిండియా అధ్యక్షులు అమిష్ పటేల్ పాల్గొని ప్రసంగిస్తారని, 22న ప్రతినిధుల సభ జరుగుతుందని, ఈ ప్రతినిధుల మహాసభను ఉన్నత విద్య మండలి మాజీ చైర్మన్ ఆర్.లింబ్రాది ప్రారంభిస్తారని, రాష్ట్ర మహాసభల్లో అధికసంఖ్యలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లాడ బ్రాంచ్ కమిటీ నాయకులు టి.శ్రీను, రాఘవ, నారాయణ, వెంకటేశ్వర్లు, సత్యం, రమణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్యాబోధన



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఇఓ మురళీమోహన్ రావు కోరారు.. బడిబాటలో భాగంగా సోమవారం వెంకటాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత పొందిన ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులచే మంచి బోధన పద్ధతుల ద్వారా విద్యార్థులకు బోధన చేస్తారని తెలిపారు. పాఠశాల హెచ్ఎం వెల్లంకి నాగరాజు మాట్లాడుతూ గ్రామస్తుల సహాయ సహకారాలతో విద్యార్థుల హాజరుశాతం పెంచడంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యాసంవత్సరం మొదటి తరగతి నుండి ఇంగ్లీష్ మీడియం అందిస్తామని తెలిపారు. అనంతరం మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి సుధాకర్‌రెడ్డి వితరణతో రూ.12వేలు విలువ చేసే నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం సొసైటీ మాజీ అధ్యక్షులు బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ నిర్మల, సొసైటీ అధ్యక్షులు వెన్నపూస కృష్ణారెడ్డి, వేముల వెంకటేశ్వరరావు, స్వర్ణ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన రైతు నేస్తం కేంద్రాలు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని కల్లూరు, ముచ్చవరం, రైతు వేదికలలో రైతు నేస్తం కేంద్రాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దృష్య్టా శ్రవణం ద్వారా ప్రత్యక్ష ప్రసారం ద్వారా సీఎం రైతులతో మాట్లాడారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో సలహాలు, సూచనలు రైతులకు అందించారు. రైతు భరోసా రైతు సంక్షేమ పథకాలు వ్యవసాయ సలహాలు, సూచనలు దృష్య్టా శ్రవణం ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్ లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు దీపిక, పవన్ కళ్యాణ్, వెంకట్ లీల తోపాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి



**ప్రజాపక్షం/పెనుబల్లిః** రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖాముఖి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమానికి హాజరై పెనుబల్లి మండల రైతు సోదరులు, వ్యవసాయ శాఖ అధికారులు వీక్షించారు. పెనుబల్లి మండలంలోని పెనుబల్లి, అడవి మల్యాల, కుప్పనకుంట్ల గ్రామాలలోని రైతు వేదికల నందు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని 1031 వేదికలకు ముఖాముఖి అనుసంధానం ప్రత్యక్ష ప్రసారంలో భాగస్వాములై వీక్షించి విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏవీఎస్ ప్రసాద్ రాజు, వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** మండల పరిధిలోని రుద్రాక్షపల్లి యూపిఎస్ నందు గుడిపూడి దుర్గారావు జ్ఞాపకార్థం విద్యార్థులకు సోమవారం నోట్ బుక్స్, ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా గ్రామ సీనియర్ నాయకులు డా దాసరి దివాకర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిల్స్, కంబాక్స్ లు గుడిపూడి దుర్గారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు దుర్గా మెడికల్స్ అధినేత గుడిపూడి గాంధీ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోట్ బుక్స్ , ప్లేట్లు పంపిణీ చేయటం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నక్కా రాజేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు పి.సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీలను శుభ్రపరచాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** పట్టణంలోని జవహర్ నగర్ కాలనీ 13వ వార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ సోమవారం పర్యటించి, స్థానికుల నుండి సమస్యలను అడిగి తెలుసుకోవటమే కాకుండా తక్షణమే సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ వారితో మాట్లాడి డ్రైనేజీలు శుభ్రం చేయించి, చెత్త తొలగించాలని ఆదేశించారు. అదేవిధంగా మిషన్ భగీరధ అధికారులతో చర్చించి త్రాగునీటి ఇబ్బందిని పరిష్కరించారు. నీటి పైప్ లైన్ లేని చోట కొత్త పైప్ లైన్ వేయాలని సూచించారు. ఈ సందర్బంగా దోమ ఆనంద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు 13 వ వార్డు జవహర్ నగర్ లో పర్యటించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మిషన్ భగీరథ సిబ్బంది, నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణపై నియంత్రణ కరువు





-విద్యా హక్కు చట్టానికి నారాయణ తూట్లు
-ఏఐఎస్ఎఫ్ ఆందోళనతో దిగివచ్చిన అధికారులు
-నారాయణ విద్యా సంస్థల బుక్స్, యూనిఫామ్స్ గోడౌన్ సీజ్

**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేటు, కార్పోరేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న విద్యాశాఖాధికారుల తనిఖీలు శూన్యమని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో నారాయణ విద్యా సంస్థల్లో అధిక ఫీజులు తగ్గించాలని ఆందోళన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ ఆందోళనతో అధికారులు దిగివచ్చి నారాయణ విద్యా సంస్థలపై అర్బన్ ఎంఈవో శైలజ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి బుక్స్, యూనిఫామ్స్ గోడౌన్‌ను సీజ్ చేశారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల్లో ఫీజుల పేరుతో వసూళ్ల దందా కొనసాగిస్తున్నారన్నారు. అడ్మిషన్ ఫీజులు, డోనేషన్లు, బుక్స్, యూనిఫామ్స్‌కు, ఐఐటి ఫౌండేషన్ వంటి వివిధ రకాల ఫీజులను అడ్డగోలుగా వసూలు చేస్తున్నారన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యా హక్కు చట్టాన్ని విస్మరించి ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని అయినా ప్రభుత్వం చూసిచూడనట్లుగా వ్యవహరిస్తుందన్నారు. ప్రైవేటు, కార్పోరేట్ విద్యా సంస్థల్లో ఎస్సి, ఎస్టి, బిసి పేద వర్గా విద్యార్థులకు 25 శాతం ఫీజు రాయితీ అమలు కావడం లేదన్నారు. ఆట స్థలాలు లేకుండానే పాఠశాలలు నిర్వహిస్తున్నా అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. పాఠశాలలే యూనిఫాం, బుక్స్‌ను విక్రయిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థలపై తనిఖీలు నిర్వహించి అనుమతి లేని సంస్థలను తక్షణమే సీజ్ చేయాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, సహాయ కార్యదర్శులు షేక్ నాగులమీరా, మధు, నాయకులు మనోజ్, గోపి, పవన్, వినయ్, లక్ష్మణ్, గౌతమ్, సురేష్, నాగరాజు, ఉమా, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో రేషన్ రీసైక్లింగ్‌పై రహస్య విచారణ..?



-టాస్క్‌ఫోర్స్, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారుల తనిఖీలు
-ఏ రేషన్ షాపులు నుండి ఏ మిల్లులకు వెళుతున్నాయో నిఘా

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని రేషన్ బియ్యం రీసైక్లింగ్ వ్యవహారంప రెవెన్యూ టాస్క్‌ఫోర్స్, సివిల్‌సప్లై అధికారులు విచారణ చేపట్టారు అనేది విశ్వసనీయ సమాచారం. గత రెండు రోజులుగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని పలు రేషన్ షాపుల పట్ల పలు మిల్లులపై అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తుంది. రేషన్ షాపులు నిర్వాహకులు మిల్లులకు నేరుగా పంపిస్తున్నారా దళారులు మిల్లర్లు, రేషన్ షాపు నిర్వాహకులు ఒకటై దందా కొనసాగిస్తున్నారా అనే దానిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టారు అనేది తెలుస్తుంది. శాంతినగర్ సమీపంలో ఏపే మిల్లులు ఉన్నాయి. అదేవిధంగా వైరా పట్టణంలో మిల్లర్లతో ఏమైనా సంబంధాలు, మండలంలోని మిల్లర్లతో డీలర్లకు ఏమైనా సంబంధం ఉన్నాయా అనే దానిపై క్షుణ్ణంగా విచారణ చేపట్టారు. కొంత మంది రేషన్ బియ్యం తండా చేస్తున్న దళారులు నుంచి సమాచారం రాబట్టేందుకు అధికారులు విచారణకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే కొంతమంది రేషన్ దళారులు కొంతమంది మిల్లర్ల పేరు కూడా అధికారులకు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లకు అందించింది. మిల్లర్లు ఆ ధాన్యాన్ని తీసుకొని రైస్ ఆడించి మరల ప్రభుత్వానికి ఇవ్వాలి దానినే సిఎంఆర్ రైస్ అంటారు. అయితే సిఎంఆర్ రైస్ స్థానంలో రేషన్ రైస్‌ను పెట్టి ఇస్తున్నారు అనే వార్త ఇప్పుడు వైరాలో చక్కెరలు కొడుతుంది. డీలర్లు ఎవరెవరు దళారులతో సంబంధాలు పెట్టుకొని ఏపే మిల్లర్లకు అందిస్తున్నారనే దానిపై ఇప్పటికే జిల్లా అధికారులు నివేదిక కోరినట్లు సమాచారం. వారి నివేదిక ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో రెవిన్యూ, టాస్క్‌ఫోర్స్, సివిల్‌సప్లై అధికారులు వైరాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలుస్తుంది. కొంతమంది రేషన్‌దారులు రేషన్‌కార్డు దారుల నుంచి వారి వేలిముద్ర ఎంచుకొని బియ్యాన్ని వారి వద్దే ఉంచుకొని వారే కొనుగోలు చేస్తున్నారని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో, 6వ వార్డులో, బిసి కాలనీలో ఉన్న డీలర్ షాపులో వద్ద నుండి పెద్ద ఎత్తున బైకులపై ఆటోలపై కొంతమంది దళారులు అక్కడే ఉండి సరఫరా చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఏది ఏమైనా ప్రజాపంపిణీ వ్యవస్థ బియ్యాన్ని రీసైక్లింగ్ పేరుతో ప్రభుత్వానికి పంపించేందుకు చేస్తున్న పెద్ద కుట్రను చేదించేందుకే అధికార యంత్రాంగం విచారణ జరుపుతుందని తెలుస్తుంది.

# మావోయిస్టులు వద్దు.. ఆదివాసీల అభివృద్ధే ముద్దు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి :** ఆదివాసీలు వద్దు అభివృద్ధి ముద్దు అని ఆదివాసీ గుడాలకు ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే సమాచారం అందించి తగిన పారితోషికం పొందవచ్చునని ఆళ్లపల్లి ఎస్ఐ ఎం సోమేశ్వర్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం ఆదివాసి గ్రామం భూసరాయిలో క్యాసో నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో చత్తీస్గఢ్ రాష్ట్రంలో వరస ఎన్కౌంటర్లు, అరెస్టులతో తీవ్రంగా నష్టపోయిన మావోయిస్టు సాయుధ దళాలు తెలంగాణ ప్రాంతంలోకి వచ్చి ఆదివాసి నివాస ప్రాంతాలను ఆధారంగా చేసుకుని సంచరిస్తున్నట్లు, నమ్మకమైన గట్టి ఆధారాలు లభిస్తున్నాయని, కావున మావోయిస్టు దళ సభ్యులు లేదా అనుమానితులు అపరిచిత వ్యక్తులు ఎవరైనా మీ ఆదివాసి గుంపుల దగ్గరలో సంచరించినట్లు యితే వెంటనే 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చి తగిన పారితోషకం పొందండి సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని, సాయుధ దళాల సభ్యులకు కిరాణా సామాగ్రి తినే పదార్థాలు డబ్బులు, ఇతర వస్తువులు సరఫరా చేసి సహకరించినట్లయితే లేదా ఆశ్రయం ఇచ్చినట్లయితే చట్ట ప్రకారం అరెస్టు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆ చర్యలో భాగంగానే మావోయిస్టు దళ సభ్యులకు సహకరించిన ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులను తెలంగాణ ప్రాంతం నుండి వారి సొంత ఊర్లకు పంపబడునని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కెటిఆర్‌కు మద్దతుగా తరలిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/భద్రాచలం :** విచారణకు వెళుతున్న కేటిఆర్ మద్దతుగా భద్రాచలానికి చెందిన బిఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణలు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఆగమైపోతున్న తెలంగాణ బిడ్డల బ్రతుకులను బాగు చేసేందుకు ప్రాణాలకు తెగించి పేగులు తెగిపడేలా తెలంగాణ ఉధ్యమాన్ని చేపట్టిన ఆ నాటి యూపిఏ 2 ప్రభుత్వం మెడలు వచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసిఆర్ కుటుంబంపై కాంగ్రెస్ ప్రభుత్వం కత్తికట్టి విచారణల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు మానుకుని, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ తరలివెళ్లినవారిలో ప్రభోద్‌కుమార్, రామిరెడ్డి, కణితి రాముదు, వాగే కృష్ణ పాటు తదితరులున్నారు.

# హైదరాబాద్ తరలిన బిఆర్ఎస్ శ్రేణులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఈ ఫార్ములా కేసులో అక్రమంగా విచారణకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్‌ను పిలిచినందుకు ఖమ్మం నియోజక వర్గ బిఆర్ఎస్ శ్రేణులు మద్దతుగా హైదరాబాద్ తరలి వెళ్లారు. సోమవారం హైదరాబాద్‌లో కేటిఆర్ విచారణ సందర్భంగా ఆయనకు మద్దతుగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపు మేరకు నియోజక వర్గానికి చెందిన బిఆర్ఎస్ శ్రేణులు భారీగా హైదరాబాద్ తరలి వెళ్లారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏ మెచ్చా నాగేశ్వరరావు తో పాటు నియోజక వర్గానికి చెందిన పలువురు నాయకులు బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, కార్పొరేటర్లు వలరాజు, నాగండ్ల కోటి, వీరునాయక్, గుత్తా రవి, మాధంశెట్టి హరిప్రసాద్, మెంటెం రామారావు, చెరుకూరి ప్రదీప్, దొంతు సత్యనారాయణ, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా పథకం ప్రారంభం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలంలోని రైతు వేదిక నందు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర వ్యాప్తంగా 1031 రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానం చేస్తూ రైతు భరోసా పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మార్కోడు రైతు వేదిక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారానికి అనుసంధించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని 11 మంది ఆదర్శ రైతులతో వీడియో ద్వారా సంభాషించి, వారి నుండి వ్యవసాయ పరిస్థితులు, చిట్కాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆళ్లపల్లి మండల స్థాయిలో ఈ కార్యక్రమంలో పెందాకట్ల పాపంరావు, మోకాళ్ళ శేఖర్, వాసం శ్రీకాంత్, పాయం రామ్ నర్సయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి విజయం వంశీలు, మార్కోడు రైతు వేదిక నుండి మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి బీ విజయ్ రైతులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా అజోల్లా, బయోచార్, కంపోస్ట్ పిట్, తదితర సాంకేతికతలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ఈ వానాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా సమగ్రంగా సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో రైతులు పడిగ సమ్మయ్య, గొగ్గేలా వెంకటేశ్వర్లు, పడిగ రాజు, రమేష్, గొగ్గేలా లక్ష్మి , తదితర మహిళా రైతులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అపూర్వ కలయిక



**ప్రజాపక్షం/కామేపల్లి:** మండల పరిధిలోని ముచ్చర్ల, జాస్తిపపల్లి హైస్కూల్‌లో 199192 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు లక్ష్మి గార్డెన్స్ నందు కలుసుకున్నారు. తమ చిన్న నాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి తమ గురువులైనటువంటి జానకిరామయ్య తెలుగు మాస్టార్, సాదు లక్ష్మణరావులను ఘనంగా సన్మానించారు. దీనితో పాటు బ్యాచ్‌లో భగవద్గీత లోని 720 శ్లోకాలను కంఠస్థం చేసిన తమ సహచర విద్యార్థి అయినటువంటి మద్దినేని ఉషారాణిని పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులైనటువంటి రామారావు, నారాయణ, రామయ్య, పరమాత్మ చారి, కోటయ్య, ప్రసన్న కుమార్, దామోదర్, నరసింహారావు, యాకుబ్ పాషా, యలమద్ది రమేష్, గుండ్ల రమేష్, వనిత, వరలక్ష్మి , ఉషారాణి, అన్నపూర్ణ, రోజా, రమణి, తదితరులు పాల్గొన్నారు.

# రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్




**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమం 1031 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం కార్యక్రమం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. సింగరేణి మండలం అప్పాయిగూడెం రైతు వేదికలో తహసీల్దార్ ఎస్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు మున్ని, ప్రమీల, అప్పాయిగూడెం పంచాయితీ కార్యదర్శి కృష్ణవేణి, సొసైటీ డైరెక్టర్ బానోత్ హీరలాల్, రైతులు సపసపవట్ నాగులు, గుగులోత్ భీముడు, బానోత్ రాందాస్, రాంచందర్, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను కాపాడుకోవాలి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఎఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మగాని హరీశ్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను సోమవారం ఎఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి బృందం సందర్శించారు. ఈ సందర్భంగా బృంధం నూతన విద్యా సంవత్సరంలో అడుగుపెట్టిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ..ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు,యువత సహకరించాలని కోరారు. పేదవిద్యార్థుల కోసం ప్రభుత్వ విద్యాసంస్థలలో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మౌళిక సదుపాయాలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నాభోజనం, ఏకరూపదుస్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎన్.సాయి, సత్యాన్వేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.